ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పశ్చిమ గోదావరి
జిల్లా వార్తలు
5
సోమవారం 8 డిసెంబరు 2025



భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 30.0
కనిష్ఠం : 20.0



శ్రీవారి సేవలు అద్వితీయం

భక్తులకు దర్శనంతో పాటు, మౌలిక వసతుల కల్పన, నాణ్యమైన ప్రసాదం అందించడం వంటి విషయాల్లో ద్వారకాతిరుమల వేంకటేశ్వర స్వామి ఆలయం రాష్ట్రంలోనే రెండో స్థానంలో నిలిచింది. ప్రధాన ఆలయాల్లో ఒకటైన ద్వారకాతిరుమల క్షేత్రానికి వచ్చిన భక్తులకు మెరుగైన సేవలందించడంలో 71.5 శాతంతో రెండో స్థానం సాధించింది.

7



ఉత్సాహంగా 10కే రన్

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంకల్పానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ఆదివారం తణుకు రన్నర్స్ సొసైటీ, ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఆధ్వర్యంలో పట్టణంలో నిర్వహించిన 10 కేఎం, 5 కెఎం, 3 కేఎం రన్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రన్‌లో పట్టణ ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు



ఆక్వానందం

ఆక్వా జోన్ పరిధిలోకి 30 వేల ఎకరాలు
డిసెంబరు 15 నుంచి అమలు
ఇప్పటి వరకు నాన్ ఆక్వాజోన్‌లో..
కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత కసరత్తు
జిల్లాలో అన్ని చెరువులు జోన్ పరిధిలోకి ..

(భీమవరం-ఆంధ్రజ్యోతి) : జిల్లాలో నాన్ ఆక్వాజోన్‌లో ఉన్న చెరువులకు మోక్షం లభిస్తోంది. జోన్ పరిధిలోకి తీసుకు రానున్నారు. ఇదివరకే ప్రభుత్వం దీనికి ఆమోదముద్ర వేసింది. జిల్లా అధికారులు పంపిన ప్రతిపాదనలపై సానుకూలంగా స్పందించింది. ఇకపై వాటిని చట్ట పరిధిలోకి తీసుకురానున్నారు. రాష్ట్ర ప్రభుత్వం డిసెంబరు 15 నుంచి నాన్ ఆక్వా జోన్‌లో ఉన్న చెరువులను అధికారికంగా గుర్తించనుంది. జిల్లాలో దాదాపు 30 వేల ఎకరాల చెరువులు నాన్ ఆక్వాజోన్‌లో ఉన్నాయి. అనధికారికంగా వాటిని సాగు చేస్తున్నారు. అనుమతులు కూడా మంజూరు చేయడం లేదు. రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం కూడా లేదు. రైతులకు ప్రభుత్వం నుంచి రాయితీలు కూడా అందడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దీనిపై సుదీర్ఘ కసరత్తు చేసింది. గ్రామ సభలను ఏర్పాటు చేసింది. నాన్ ఆక్వాజోన్‌లో ఉన్న చెరువులను గుర్తించింది. జిల్లాస్థాయి కమిటీ సమావేశంలో నాన్ ఆక్వా జోన్ చెరువులను ఆమోదించారు. ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. మరో 6,000 ఎకరాల్లో కొత్తగా చెరువులు తవ్వుకోవడానికి అవకాశం ఉందని గుర్తించారు. ఇప్ప టికే నాన్ జోన్‌లో ఉన్న చెరువులపై ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుంది. అప్పుడా చట్ట పరిధిలోకి తీసుకు వచ్చేలా నోటిఫికేషన్ జారీచేయనుంది. ఫలితంగా రైతులు ఎన్నో ప్రయోజనాలను పొందనున్నారు.

వేగవంతమైన రిజిస్ట్రేషన్లు

జిల్లాలో ఆక్వా చెరువుల రిజిస్ట్రేషన్ తప్పనిసరి చేశారు. వాస్తవానికి జిల్లా వ్యాప్తంగా 1,36,000 ఎకరాల్లో ఆక్వా చెరువులు విస్తరించి ఉన్నాయి. ఇప్పటి దాకా సుమారు 65 వేల ఎకరాల్లో రిజిస్ట్రేషన్‌లు పూర్తి చేశారు. తాజాగా జోన్ పరిధిలోకి వచ్చే 30 వేల ఎకరాల్లో కూడా రిజిస్ట్రేషన్‌కు వెసులుబాటు లభించనుంది. మరోవైపు జాయింట్ ఎల్‌పీ నంబర్‌ల నెపంతో ఇప్పటిదాకా రిజిస్ట్రేషన్‌కు అనుమతి ఇవ్వలేదు. వీటిపైనా ప్రభుత్వం సుముఖత చూపింది. ఆక్వా చెరువులకు హద్దులు లేవంటూ జాయింట్ ఎల్‌పీ నంబర్‌లు కేటాయించారు. రీసర్వేలో ఇదో పెద్ద తప్పిదం జరిగింది. దానిని సరిదిద్దేందుకు రెవెన్యూ శాఖ కసరత్తు చేస్తోంది. అంతదాకా జాయింట్ ఎల్‌పీ నంబర్‌లతో రిజిస్ట్రేషన్ చేసుకునే వెసులుబాటు ఇస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో 100 శాతం చెరువుల రిజిస్ట్రేషన్‌కు అధికారులు సమాయత్తమవుతున్నారు.

రిజిస్ట్రేషన్ ఉంటేనే రాయితీలు

అప్పుడా చట్టంలో రిజిస్ట్రేషన్ అయిన చెరువులకు మాత్రమే రాయితీలు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. దాంతో రైతులు కూడా ముందుకొస్తున్నారు. నాన్ ఆక్వా పరిధిలోని 30 వేల ఎకరాల్లో రిజిస్ట్రేషన్‌కు అవకాశం లభించింది. ఇప్పటిదాకా వీటికి ప్రభుత్వ నుంచి ఎటువంటి రాయితీలు లేవు. విద్యుత్ రాయితీ ఇవ్వలేదు. ప్రభుత్వం యూనిట్ విద్యుత్ ధర రూ.1.50లకు సరఫరా చేస్తోంది. ఇప్పటిదాకా నాన్ ఆక్వా జోన్‌లోని 30 వేల ఎకరాల్లో చెరువులకు ఈ రాయితీ వర్తించ లేదు. రిజిస్ట్రేషన్ చేసుకుంటే వాటికి కూడా రాయితీ అమలు చేయనున్నారు. రిజిస్ట్రేషన్ చేయకపోతే మున్ముందు జోన్ పరిధిలోని చెరువులకు సైతం నిలిపివేస్తారు.




కుదుటపడని కొత్త జిల్లా

జిల్లాల పునర్విభజనలో భాగంగా భీమవరం కేంద్రంగా పశ్చిమ గోదావరి జిల్లా ఏర్పడి దాదాపు నాలుగేళ్లు పూర్తి అవుతున్నది.. అయినా ఇంకా కష్టాల కడలిలో కొట్టు మిట్టాడుతోంది.. ప్రధానమైన కార్యాలయాలు కూడా దిక్కుతోచని స్థితిలో ఉన్నాయి.. అద్దె భవనాల్లో అరకొర వసతులతో నెట్టుకొస్తున్నాయి.. కొత్త జిల్లా కదా.. అని ఇంకా సర్దుకుపోతున్నారు..

- జిల్లా కేంద్రంలో వెంటాడుతున్న కష్టాలు
- ప్రైవేటు భవనంలో కలెక్టరేట్ నిర్వహణ
- రవాణా సౌకర్యం లేని ప్రాంతంలో ఏర్పాటు
- రికార్డులు భద్రపరచుకోవడం కష్టమే
- ఇరుకుగదుల్లో సర్దుకుపోతున్న ఉద్యోగులు
- సరైన వసతులు లేక అవస్థలు
- రెవెన్యూ డివిజన్, ఎస్పీ కార్యాలయాలదీ అదే పరిస్థితి

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

పశ్చిమ గోదావరికి జిల్లా కేంద్రమైన భీమవరం పట్టణానికి ఒక ప్రత్యేకత ఉంది. పార్లమెంట్ కేంద్రం నరసాపురం అయినప్పటికీ జిల్లాల పునర్విభజనలో భీమవరం పట్టణానికి జిల్లా కేంద్రంగా చేశారు. జిల్లాలోని అన్ని నియోజక వర్గాలకు పట్టణం అందుబాటులో ఉంది. భీమవరం అనగానే ఎందరో అధికారులు ఇక్కడ పని చేసేందుకు ఆసక్తి చూపారు. ప్రభుత్వం బదిలీపై ఇక్కడకు పంపితే ఆగమేఘాలపై వచ్చి చేరిపోతున్నారు. తీరా ఇక్కడకు వచ్చాక సమస్యలు తెలిసి వస్తున్నాయి. తాత్కాలిక భవనంలో కలెక్టరేట్ కార్యాలయం ఉంది. ఊరికి మూడు కిలో మీటర్ల దూరంలో రవాణా సౌకర్యం లేని ప్రాంతంలో కలెక్టరేట్ ఏర్పాటు చేశారు. అందులో అనేక ప్రభుత్వ కార్యాలయాలున్నాయి. ఏ ఒక్క కార్యాలయానికి సరైన సౌకర్యం లేదు. ఇరుకు



ఇరుకు గదుల్లో పనిచేస్తున్న కలెక్టరేట్ సిబ్బంది



కలెక్టరేట్ వద్ద ఆరుబయటే వాహనాలు

గదులు. సిబ్బంది కూర్చుంటే పక్కకు తిరిగే పరిస్థితి లేదు. కుర్చీ కదపడానికి కూడా అనువుగా ఉండవు. రికార్డులు భద్ర పరిచే గదులు కూడా లేవు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు కామన్ మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. ఇంజనీరింగ్ కళాశాల కావడంతో కామన్ మరుగుదొడ్లే ఉన్నాయి. వాటిని కూడా తాత్కాలిక కలెక్టరేట్ ఏర్పాటు చేసిన తర్వాత మరమ్మతులు చేశారు.

రికార్డులకు దిక్కులేదు

సర్వే శాఖకు ఇప్పుడు నిత్యం పని ఉంటోంది. చిన్న గదిలో దాదాపు 30 వరకు కంప్యూ టర్‌లున్నాయి. అంతమంది సిబ్బంది పని చేస్తున్నారు, వేసవిలో అయితే కంప్యూటర్‌లు వేడెక్కిపోతుంటాయి. రికార్డులు భద్రపరిచే గదికూడా లేదు. టేబుల్‌పైన భద్రపరచి కప్పి ఉంచారు. అంతకు మించి ఆ శాఖకు దారిలేదు. కలెక్టరేట్‌కు సరిపడిన భవనం అదొక్కటే. సంబంధిత కార్యాలయాలకు వచ్చే ప్రజలు కూర్చోవడానికి కూడా సరైన వసతులు లేవు. తాత్కాలిక కలెక్టరేట్ అంటూ అధికారులు, సిబ్బంది సర్దుకుపోతున్నారు.

పంచాయతీరాజ్, సర్వే, ఎన్నికల శాఖ, ప్లానింగ్, బీసీ, ఎస్సీ సంక్షేమ శాఖలు, ట్రెజరీ, పౌర సరఫరాలు, అగ్నిమాపకశాఖ, అటవీ శాఖ, ముఖ్యంగా విద్యాశాఖ తదితర ముఖ్య కార్యాలయాలు కలెక్టరేట్‌లో కొలువు తీరాయి. ఏలూరు కలెక్టరేట్ నుంచి తెచ్చుకున్న పాత కుర్చీలనే వేసుకుంటున్న శాఖలు కూడా ఇప్పటికీ ఉన్నాయి. అధికారులు, సిబ్బంది వాహనాలను పార్కింగ్ చేసుకునే షెడ్డులు కూడా లేవు. రికార్డు పుస్తకాలను ఆరుబయటే దించేస్తున్నారు. అక్కడ నుంచి సంబంధిత కార్యాలయాలకు తరలి స్తున్నారు. ప్రభుత్వ పరంగా బడ్జెట్ అంతంత మాత్రంగానే ఉంటోంది. జిల్లా కేంద్రమైన తర్వాత భీమవరం రెవెన్యూ డివిజన్‌ను ఏర్పాటు చేశారు. దానికి కూడా సొంత కార్యాలయం లేదు. మున్సిపల్ కార్యాలయంలో నిర్వహిస్తున్నారు. ఎస్పీ కార్యాలయానిదీ అదే దుస్థితి. ప్రైవేటు విద్యా సంస్థలోనే ఏర్పాటు చేశారు. ఇటు కలెక్టరేట్, అటు ఎస్పీ కార్యాలయాలు పట్టణానికి దూరంగానే ఉంటున్నాయి. రవాణా సౌకర్యం లేని ప్రదేశంలో వీటిని ఏర్పాటు చేశారు.

కలెక్టరేట్‌పై చర్చ

భీమవరంలో కొత్త కలెక్టరేట్ ఎక్కడనేదానిపై ఇటీవల భీమవరంలో పెద్ద చర్చే జరిగింది. కలెక్టరేట్ నిర్మాణానికి అవకాశం ఇవ్వాలంటూ జిల్లా కలెక్టర్ నాగరాణి కొన్నినెలల క్రితం తణుకులో పర్యటించిన ముఖ్యమంత్రి చంద్రబాబును కోరారు. దీనిని దాతల సహకారంతో పెద అమిరంలోని స్థలంలో నిర్మిస్తారన్న ప్రచారం జరిగింది. వైసీపీ హయాంలో కలెక్టరేట్ కోసం వ్యవసాయ మార్కెట్ కమిటీ స్థలాన్ని - మిగతా 8లో



రికార్డులు ఇలా.. అస్తవ్యస్తంగా..



ఆచంటలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటుకు శిలాఫలకం ఆవిష్కరిస్తున్న కేంద్ర మంత్రి వర్మ, ఎమ్మెల్యే పితాని, కలెక్టర్ నాగరాణి

అత్యవసర వైద్యానికి ప్రాధాన్యం

ఆరు నెలల్లో అందుబాటులో డయాలసిస్ సెంటర్
త్వరలో రూ.4 కోట్లతో మొబైల్ క్యాన్సర్ టెస్టింగ్ వ్యాన్ : కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ

భీమవరం టౌన్/ ఆచంట డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రజలు ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని దానిలో భాగంగానే డయాలసిస్ సెంటర్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. ఆదివారం భీమవరం ఏరియా ఆసుపత్రి ప్రాంగణంలో, ఆచంటలో సామాజిక ఆరోగ్యకేంద్రం వద్ద అత్యాధునిక డయాలసిస్ సెంటర్ నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ విద్య, వైద్య రంగాల్లో భీమవరం ముందున్నప్పటికీ ప్రభుత్వ రంగంలో డయాలసిస్ సెంటర్ లేకపోవడం దురదృష్టకరమన్నారు. ప్రైవేట్ ఆసుపత్రులలో చికిత్స చేయించుకోలేక బాధితులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న సమస్య తన దృష్టికి వచ్చిందని అందుకే అత్యవసర వైద్యానికి ప్రాధాన్యం ఇచ్చి ఈ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆరునెలల్లో అందుబాటులోకి రానున్నదని, అత్యాధునిక డయాలసిస్ యంత్రాలతో కూడిన 10 బెడ్‌లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. త్వరలో రూ.4 కోట్లతో మొబైల్ క్యాన్సర్ టెస్టింగ్ వ్యాన్ అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే, రామాంజనేయులు కలెక్టర్ నాగరాణి, డీసీహెచ్ఎస్ డాక్టర్ పి.సూర్యనారా యణ, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ లక్ష్మణ్, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అయినంపూడి శ్రీదేవి, జిల్లా ప్రధాన కార్యదర్శి కలిదిండి వినోద్ వర్మ, జనసేన నాయకులు చంద్రశేఖర్, బండి రమేష్ నాయుడు పాల్గొన్నారు. ఆచంటలో రూ. కోటితో ఏర్పాటు చేయనున్న డయా లసిస్ కేంద్రానికి ఆదివారం కేంద్ర మంత్రి వర్మ, ఎమ్మెల్యే పితాని, కలెక్టర్ నాగరాణి భూమి పూజ చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఎమ్మెల్యే పితాని మాట్లాడుతూ డయాలసిస్ కేంద్రం ఏర్పాటుతో బాధితులకు కష్టాలు తప్పుతాయన్నారు. మెడికల్ ఆఫీసర్ అనూష, జెడ్‌పీటీసీ ఉప్పల పాటి సురేష్‌బాబు, ఎంపీపీ సూర్యకుమారి పాల్గొన్నారు.

పారిశుధ్యానికి అడ్డొచ్చిన ఆక్రమణలు తొలగించాలి : జేసీ



భీమవరం టౌన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఆక్రమణల తొలగింపులో అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, వీధులను శుభ్రంగా ఉంచాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి మునిసిపల్ అధికారులను ఆదేశించారు. ఆదివారం ఉదయం పట్టణంలో వీరమ్మ పార్కు రైతు బజార్, కొత్త బస్టాండ్, రైల్వే జంక్షన్, ప్రకాశం చౌక్, జేపీ రోడ్డు ప్రాంతాలలో ఆయన రెవెన్యూ, మున్సిపల్ శాఖ అధికారులతో కలసి పరిశీలించారు. పారిశుధ్యానికి ఇబ్బంది కలిగించే ఆక్రమణలను వెంటనే తొలగించాలని అధికారులు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. కొత్త బస్టాండ్ ప్రాంతంలో రోడ్డుమీదకు షెడ్డులు నిర్మించి ఉన్న ఆక్ర మణలు వెంటనే తొలగించాలన్నారు. రైల్వే జంక్షన్ ఫ్లైఓవర్ వద్ద డంపింగ్ చేస్తున్న చెత్తనంతా తొలగించాలని ఆదేశించారు. రైతు బజారు పరిశీలించి కూరగాయల ధరలు అడిగి తెలుసుకున్నారు.ప్లాస్టిక్ కవర్లు వాడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్డీవో కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి, శానిటేషన్ సిబ్బంది ఉన్నారు.

వనామి రొయ్యకు వైరస్

- సీడ్ దశలోనే చనిపోతున్న రొయ్యలు
- రైతులు నష్టాలపాలు



కలిదిండి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): వాతావరణంలో మార్పులతో వనామి రొయ్యకు వైరస్ సోకడంతో సీడ్ దశలోనే చనిపోవడంతో ఆక్వా రైతులు నష్టాల పాలవుతున్నారు. రొయ్యలసీడ్ వేసిన నెలరోజులకే మృత్యువాత పడుతున్నాయి. కనీసం వంద కౌంట్‌కు రాకుం డానే చిన్నసైజు రొయ్యలు చనిపోతుండడంతో స్థానిక వ్యాపారులు వీటిని కొనుగోలు చేయడం లేదు. దీంతో రైతులు ఏలూరు, ఆకివీడు, మార్కెట్‌కు తరలించి అయికాడికి అమ్ముకుం టున్నారు. గిట్టుబాటు ధర లభించకపోవడంతో పెట్టుబడులు రావడం లేదని రైతులు వాపోతు న్నారు. నెల్లూరు, వైజాగ్, కాకి నాడ, చెన్నైతో పాటు స్థానికంగా సుమారు 250 హేచరీలు న్నాయి. ప్రభుత్వం ఆధ్వర్యంలో కొన్నిచోట్ల సీడు ఉత్పత్తి పరిమితంగా సాగుతోంది. హేచరీ యాజమానులు లాభార్జనే ధ్యేయంగా రొయ్యల సీడ్‌కు పీసీఆర్ పరీక్షలు జరపకుండా సీడ్ విక్రయించడంతో చెరువుల్లో వేసిన నెలరోజులకే వైరస్ సోకి చనిపోతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. రొయ్యలసీడు హేచరీలపై ప్రభుత్వ నియంత్రణ లేకపోవడంతో పుట్టగొడుగుల్లా హేచరీలు పుట్టుకొస్తున్నా యని వీటిపై ప్రభుత్వ నియంత్రణ ఉండాలని రైతులు కోరుతున్నారు.

సీడు వేసే ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

రొయ్యపిల్లలను చెరువులో వేసే ముందు చెరువులో గుణగణాలను పరీక్షించి తెలుసుకోవాలని మండల మత్స్యశాఖాధికారి రవికుమార్ తెలిపారు. చెరువులో ఒక అడుగు నీరు నిండిన తర్వాత ప్లవకాలు వృద్ధి చెందేలా దృష్టి పెట్టాలన్నారు. సీడ్ వేసే సమయంలో మూడు అడుగుల మేర నీరుపెట్టి అమోనియా నైట్రేట్ వంటి అన్ని పరీక్షలు చేయించుకోవాలన్నారు.

35 పైసలు పెరిగిన రొయ్యపిల్ల ధర

రొయ్యపిల్ల ధర అమాంతంగా హేచరీల్లో 35 పైసలకు పెంచారు. మొన్నటి వరకు 25 పైసలుండేది. ఎకరానికి లక్ష నుంచి 2 లక్షల వరకు రొయ్యపిల్లలను చెరువుల్లో వేస్తున్నారు. పెరిగిన ధరతో సీడు కొనుగోలు చేసి చెరువుల్లో వేసి నెలరోజులు గడిచేసరికి వైరస్ సోకడంతో రొయ్యలు మృత్యువాత పడడంతో నష్టాలపాలవుతున్నారు.



ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

యూటీఎఫ్ కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్సీ గురుమూర్తి 7

జిల్లా కేంద్రం సాధనకు పోరాటం చేయాలి

నరసాపురంలో రౌండ్‌టేబుల్ సమావేశం 8

మార్కెట్ వాచ్

పెరిగిన చికెన్ ధరలు

7

దిగివచ్చిన వంకాయ ధర.. నిలకడగా ఉల్లి



గోదావరిలో ఆగిన పంటును తాళ్లతో ఒడ్డుకు లాగుతున్న మరో పంటు



గోదారి మధ్యలో బిక్కు..బిక్కు

నరసాపురం టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వశిష్ఠ గోదావరిలో ప్రయాణికులతో నడిచే పంటు మధ్యలో నిలిచిపోయింది. సాంకేతిక సమస్య తలెత్తడంతో సఖినేటిపల్లి రేవుకు వెళ్లాల్సిన పంటు నది మధ్యలో ఉండిపోయింది. దీంతో ప్రయాణికులు తీవ్ర భయందోళన చెందారు. ఆదివారం కావడంతో పుణ్యక్షేత్రాలకు వెళ్లేందుకు పెద్ద సంఖ్యలో పంటులో ప్రయాణిస్తున్నారు. అయితే గోదావరి మధ్యలో సడెన్‌గా పంటు నిలిచిపోవడంతో ప్రయాణీకులు ఆరా తీశారు. ఏమీ లేదు.. సాంకేతిక సమస్య రావడం వల్ల నిలిచిపోయిందని బోటు సిబ్బంది చెప్పారు. నిర్వాహకులు మరో పంటును రప్పించి తాళ్ల సాయంతో పంటును సఖినేటిపల్లి రేవు గట్టుకు తీసుకెళ్లారు. దీంతో హమ్మయ్యా... అంటూ ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

రామాయమ్మరావుపేటలో పారిశుధ్యం పరిశీలన



పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో పద్మావతి

నూజివీడు టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : స్క్రబ్ టైఫస్ ఫీవర్ కనిపించిన నూజివీడు రామాయమ్మరావుపేట ప్రాంతంలో పారిశుధ్య పరిస్థితులను నూజి వీడు డిప్యూటీ డీఎంహెచ్‌వో పద్మావతి పరిశీలించారు. పారిశుధ్యం అధ్వానంగా ఉండడంతో ఆమె అసహనం వ్యక్తం చేశారు. పారిశుధ్యం మెరుగుదలకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం బాధితుడు విజయవాడ జీజీహెచ్‌లో వైద్య సేవలను పొందుతున్నాడని, ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందన్నారు. బాధితుడి కుటుంబ సభ్యులకు వైద్య పరీక్షలు నిర్వహించగా వారికి అనారోగ్య లక్షణాలు లేవన్నారు. కార్యక్రమంలో వైద్యులు కుర్ర నరేంద్ర కృష్ణ పాల్గొన్నారు.



రోడ్ రన్‌లో పాల్గొన్న మంత్రి, కలెక్టర్, ఎస్పీ, ఏపీఐఐసీ చైర్మన్, ఇతర అధికారులతో సెల్ఫీ తీసుకుంటున్న ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ

శారీరక దృఢత్వంతోనే ఆరోగ్యాంధ్ర

తణుకు రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి):ప్రతి ఒక్కరూ శారీరక దృఢత్వానికి, ఆరోగ్యం కోసం కొంత సమయాన్ని కేటాయించాలని, తద్వారా ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంకల్పానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ఆదివారం తణుకు రన్నర్స్ సొసైటీ, ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన తణుకు రోడ్ రన్ 10 కేఎం, 5 కెఎం, 3 కేఎం కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి రవికుమార్ మాట్లాడుతూ ప్రతి ఇల్లు, గ్రామం, పట్టణం పరిశుభ్రంగా వుండాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశయమన్నారు. ప్రతి ఒక్కరూ తమ శారీరక దృఢత్వానికి, ఆరోగ్యానికి రోజులో కొంత సమయాన్ని కేటాయించాలని కోరారు. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ యువత తమ శారీరక ఫిట్‌నెస్ కోసం కొంత సమయాన్ని కేటాయించాలన్నారు. ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ కార్యక్రమంలో 2,800 మంది యువత ఉత్సాహంగా పాల్గొన్నారని చెప్పారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మీ, ఆర్‌డీవో ఖతీర్ ఖైసర్ బానో, రోడ్డు రన్ నిర్వాహకులు విశ్వ తేజ, సాయి దీప్తి, కృష్ణకిరణ్, వినయ్ పవన్ తదితరులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం కృషి

రాష్ట్రంలో పేదరిక నిర్మూలన కోసం ప్రభుత్వం చేపట్టిన పీ 4 విధానంలో కార్పొరేట్ సంస్థలు భాగస్వాములు కావడం అభినందనీయమని జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవి కుమార్ అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఆధ్వర్యంలో తణుకులోని చిరు చిరువ్యాపారులకు తోడ్పాటునందించేందుకు పీ4లో భాగంగా ఎస్‌కె మెరైన్, నెక్ సంయుక్త సహకారంతో తణుకులోని వీధి వ్యాపారులకు బండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన లబ్ధిదారులతో మాట్లాడి వారి వ్యాపార కార్యాకలాపాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో 20 మంది లబ్ధిదారులకు తోపుడు బండ్లు, ఎగ్ కార్ట్స్‌ను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, ఎస్‌కె మెరైన్ ప్రతినిధులు, నెక్ జోన్ అధ్యక్షుడు మల్లిన శ్రీనివాసు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సేవకులుగా ఉంటూ నాయకులుగా ఎదగాలి



వెంకటరెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి సుభాష్, విప్ నాయకర్, జానకీరామ్, పొత్తూరి

నరసాపురం టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సేవకులుగా ఉంటూ నాయకులుగా ఎదిగేందుకు ప్రయత్నించాలని మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. ఆదివారం పట్టణంలోని 26వ వార్డు గాంధీబొమ్మ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన శెట్టిబలిజ జాతిపితామహులు దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహాన్ని విప్ నాయకర్, మాజీ ఎమ్మెల్యే కొత్తపల్లి జానకీరామ్, టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజులతో కలిసి ఆవిష్కరించారు. ఆనంతరం సభలో మాట్లాడుతూ దొమ్మేటి వెంకటరెడ్డి అనేక సేవా కార్యక్రమాలు చేశారన్నారు. విద్యకు అవసరమైన భూములను దానం చేశారన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా యువత మంచి మార్గంలో ముందుకు సాగాలన్నారు. విప్ నాయకర్ మాట్లాడుతూ బీసీలకు ఎప్పుడు అండగా ఉంటానన్నారు. శెట్టి బలిజ కమ్యూనిటీ స్థలాన్ని చూపించి భవనాన్ని ఏర్పాటు చేసేందుకు తనవంతు కృషి చేస్తామన్నారు. దీంతో పాటు వెంకటరెడ్డి కాంస్య విగ్రహాన్ని కూడా సొంత ఖర్చులతో నిర్మిస్తామన్నారు. ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే జానకీరామ్, మాజీ ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు మాట్లాడారు. అంతకు ముందు పట్టణంలో సంఘం ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు.

పెరిగిన చికెన్ ధరలు

దిగివచ్చిన వంకాయ ధర.. నిలకడగా ఉల్లి

తాడేపల్లిగూడెం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి):మార్కెట్‌లో చికెన్ ధర ఒక్కసారిగా కిలోకు రూ.40 పెరిగింది. కార్తీక మాసం వెళ్లిన ఒక వారం వరకు నిలకడగా ఉన్న చికెన్ ఒక్కసారిగా పెరిగింది. గత ఆదివారం కూడా కిలో స్కిన్ లెస్ చికెన్ కిలో రూ.220కు విక్రయించారు. విత్ స్కిన్ రూ.200 అమ్మారు. డిసెంబరు 3వ తేదీన కిలో స్కిన్‌లెస్‌కు రూ.240కు పెరిగింది. 4వ తేదీన మరో రూ.20 పెరిగి ఏకంగా రూ.260కు చేరింది. జిల్లా వ్యాప్తంగా ఆదివారం ఒక్క రోజునే 120 టన్నుల చికెన్ వినియోగంమైంది. మిగిలిన రోజుల్లో రోజుకు జిల్లా వ్యాప్తంగా వినియోగం 35 టన్నులు మాత్రమే ఉంటుంది. ఇక కార్తీక మాసం వెళ్లకుండానే కోడిగుడ్డు ధరను పెంచేశారు.

కూరగాయల ధరలు పెద్దగా తగ్గకపోయినా వంకాయ ధరల మాత్రం అమాంతంగా తగ్గింది. గతవారం రూ.90 వరకు విక్రయించిన వంకాయ ఇప్పుడు రూ.50కు వచ్చేసింది. గరిష్టంగా వంకాయ ధర కిలో రూ.120 వరకు వెళ్లింది. ఇప్పుడు వంకాయ మార్కెట్‌కు రావడంతో వీటి ధరలు తగ్గినట్లు వ్యాపారులు చెబుతున్నారు. వర్షాలు తగ్గి చలిగాలి పెరిగితే వంకాయలు కాయడానికి అనువుగా ఉంటాయని చెబుతున్నారు. దీనిలో భాగంగా వంకాయ ఉత్పత్తి పెరిగిందని దీంతో ధరలు తగ్గుముఖం పట్టాయని తెలిపారు. చిక్కుళ్లు మాత్రం టాప్‌గేర్‌లో ఉన్నాయి. నాటుచిక్కుళ్లు కిలో రూ.150కు అమ్ముతున్నారు. సాధారణ చిక్కుళ్లు రూ.80, బీర రూ.80, బెండ రూ.80, దొండ రూ.60, బీట్‌రూట్ రూ.80, క్యారెట్ రూ80, టమాటా రూ.30, దోసకాయలు రూ.50, కీరదోస రూ.50 క్యాప్సికం రూ.100, కాకర రూ.60, కొత్తపెండ్లం రూ.60, కంద రూ.60. క్యాబేజ్ రూ.40. కాళీఫ్లవర్ ఒక్కటి రూ.30, మునగ కాడలు జత రూ.70కు, కొత్తిమీర కట్ట రూ.20కు అమ్ముతున్నారు.

ఉల్లి ధరలు మాత్రం నిలకడగానే ఉన్నాయి.తాడేపల్లిగూడెం మార్కెట్‌కు మహారాష్ట్ర నుంచి 255 టన్నుల ఉల్లి వచ్చింది. మహారాష్ట్ర నుంచి వచ్చిన అత్యంత నాణ్యమైన ఉల్లి హోల్‌సేల్‌గా క్వింటా రూ.1800 నుంచి 2000 మధ్య విక్రయించారు. మధ్యరకం ఉల్లి క్వింటా రూ.1000 నుంచి రూ.1500 మధ్య విక్రయాలు సాగాయి. ఇక రిటైల్డ్‌గా రూ.100 నాణ్యమైన ఉల్లి 4 కిలోలు, మధ్యరకం రూ.100కు 5కిలోలు, సాధారణ రకం రూ.100కు 6కిలోలు కూడా ఇచ్చారు.



అద్వితీయం

» సేవలు సమృద్ధి.. భక్తజనం సంతృప్తి..
» భక్తులకు సేవల ర్యాంకింగ్‌లో శ్రీవారి క్షేత్రానికి రెండో స్థానం
» ఫీడ్‌బ్యాక్‌తో ప్రజాభిప్రాయ సేకరణ

ద్వారకాతిరుమలలోని శ్రీవారి ఆలయం (ఇన్‌సెట్) ఉభయ దేవేరులతో శ్రీవారు భక్తుల అన్నప్రసాద భవనం →





శ్రీవారి లడ్డూ ప్రసాదం

ద్వారకాతిరుమల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆలయాలకు వచ్చే భక్తులకు దేవతా మూర్తుల దర్శనంతో పాటు, మౌలిక వసతుల కల్పన, నాణ్యమైన ప్రసాదం అందించడం అక్కడి అధికారుల కనీస బాధ్యత. దీనిపై అటు ప్రభుత్వంతో పాటు ఇటు ఆలయ ఉన్నతాధికారులు సైతం దృష్టి సారించారు. ఈ క్రమంలో భక్తులకు ఫోన్లు చేసి ఆలయాల్లో అందే సేవలపై అభిప్రాయాలు సేకరించారు. రాష్ట్ర దేవాలయాల్లో భక్తులకు అందే సేవలపై గత ఏడాది జూన్ నుంచి ఈ ఏడాది నవంబరు నెల వరకు అభిప్రాయాలు సేకరించారు.

సర్వే జరిగిందిలా..

రాష్ట్రంలోని అన్ని ఆలయాల్లో భక్తులకు మెరుగైన సేవలందించాలని ప్రభుత్వం ఎప్పటి కప్పుడు సూచిస్తూనే ఉంది. అయితే కొందరు అధికారులు ఆ ఆదేశాలను నిర్లక్ష్యం చేయడం వల్ల ఆశించిన స్థాయిలో భక్తులకు సేవలు అందడం లేదనే వాదన వినిపిస్తోంది. భక్తులకు గత ఏడాదిన్నర కాలంగా అక్కడ అందే సేవల పై ప్రభుత్వం ఆరా తీసింది. ఈ క్రమంలో రాష్ట్రంలోని జాయింట్ కమిషనర్ హోదా కల్గిన ప్రధాన 7 ఆలయాలను ఒక విభాగంలోను, డిప్యూటీ కమిషనర్ హోదా కల్గిన 14 ముఖ్య ఆలయాలను మరో విభాగంలోను చేర్చారు. భక్తులకు ఫోన్లు చేసి వారు దర్శించిన ఆలయం.. అక్కడ సౌకర్య, అసౌకర్యాలపై అభిప్రాయ సేకరణ జరిపారు. దైవ దర్శనంలో ఇబ్బంది లేదుర్కొన్నారా... తాగునీరు, వసతులు, పారిశుధ్యం సంతృప్తినిచ్చాయా... అన్న అంశాలపై ఫీడ్ బ్యాక్ తీసుకుని పర్సంటేజీలు కేటాయించారు.

- రాష్ట్రంలోని ఏడు ప్రధాన ఆలయాల్లో ఒకటైన ద్వారకాతిరుమల క్షేత్రానికి వచ్చిన భక్తు లకు మెరుగైన సేవలందించడంలో 71.5 శాతం తో రెండో స్థానం లభించగా సంతృ ప్తకరమైన స్థాయిని దక్కించుకుంది. స్వామి వారి దర్శనం సంతృప్తికరంగా ఉందా... మౌలిక సదుపా యాలు బాగున్నాయా... ప్రసాదం తాజాగా, రుచిగా ఉందా అన్న ప్రశ్నలతో భక్తుల నుంచి సేకరించిన ఫీడ్ బ్యాక్ ద్వారా ఈ స్థానం లభించింది. శ్రీకాళ హస్తి 72.7 శాతంతో ప్రథమ స్థానంలో నిల వగా, 70.4తో మూడో స్థానంలో శ్రీశైలం, 70 శాతంతో నాలుగో స్థానంలో కాణి పాకం, 68.8తో సింహాచలం ఐదో స్థానం, 67.8తో అన్నవరం ఆరో స్థానంలో నిలవగా చివరి స్థానంలో 66 శాతం సంతృప్తితో ఇంద్ర కీలాద్రి దుర్గమ్మ ఆలయం నిలిచింది. ఉప కమి షనర్ హోదా కల్గిన రాష్ట్రంలోని 14 ముఖ్య అల యాల్లో మోపిదేవి ఆలయం, నిడదవోలు కోట సత్తెమ్మ ఆలయాలు 70.2 శాతంతో మొదటి స్థానంలో ఉన్నాయి.

మెరుగైన ఫలితాలు వచ్చే అవకాశం...

గతంలో భక్తులు అంతరాలయ దర్శనం లేదని అసంతృప్తిగా ఉండేవారు. కరోనా సమయంలో నిలుపుదల చేసిన అంతరాలయ దర్శనాన్ని ఈవో ఎన్వీ సత్యన్నారాయణమూర్తి కృషితో ఇటీవల పునరుద్ధరించారు. ప్రస్తుతం అమ్మవార్ల ముందు నుంచి కూడా గతంలో వలే దర్శన ఏర్పాట్లు చేశారు. స్వామి, అమ్మవార్లను సాధారణ భక్తులు సైతం మరింత దగ్గర నుంచి చూసే అవకాశం కలగటంతో గతం కంటే మెరుగైన ఫలితాలు వచ్చి పర్సంటేజ్ పెరిగి రానున్న రోజుల్లో ప్రథమ స్థానాన్ని పొందాలని ఆశిద్దాం.



క్షేత్రంలో భక్తులకు మినరల్ వాటర్

మరిన్ని మెరుగైన సౌకర్యాలు కల్పిస్తాం..



స్వయంవ్యక్తమూర్తిగా చినవెంకన్న ద్విమూర్తులుగా కొలువుదీరిన ద్వారకా తిరుమలను ఆలయ చైర్మన్ రాజా ఎస్వీ సుధాకరరావు సూచనలతో మరింత అభివృద్ధి చేస్తాం.. ఇప్పటికే అంతరాలయ దర్శనాన్ని పునరుద్ధరించాం... అలాగే పారిశుధ్యాన్ని మరింత మెరుగుపరచేలా చర్యలు తీసుకుంటున్నాం.. శుద్ధమైన తాగునీటిని, రుచికరమైన ప్రసాదాలను భక్తులకు అందజేస్తున్నాం. కోట్లాది రూపాయలు వెచ్చించి ఎన్నో సౌకర్యాలను కల్పిస్తున్నాం.. భక్తులకు భవిష్యత్‌లో చక్కని దైవదర్శనంతో పాటు మెరుగైన సౌకర్యాలు మరిన్ని కల్పిస్తాం.

-ఎన్వీ సత్యన్నారాయణమూర్తి, ఆలయ ఈవో, ద్వారకాతిరుమల



పోలవరం ఏటిగట్టు సెంటర్‌లో జిల్లా సాధన సమితి ధర్నా

పోలవరం కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేయాలి

పోలవరం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): పోలవరం కేంద్రంగా జిల్లా ప్రకటించాలని స్థానిక ఏటిగట్టు సెంటర్‌లో పోలవరం జిల్లా సాధన సమితి నాయకులు ధర్నా నిర్వహించారు. నాయకులు బుగ్గా మురళీ కృష్ణ, సొబ్బన ఆనందరావు తదితరులు మాట్లాడుతూ పోలవరం జిల్లా కేంద్రంగా పోలవరం జిల్లా ప్రకటిస్తే స్థానికులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు వస్తాయని కలలు కన్న ప్రజల ఆడియాశలయ్యాయన్నారు. ప్రభుత్వం స్పందించి పోలవరాన్ని జిల్లా కేంద్రంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ధర్నాతో ఏటిగట్టు సెంటర్ వద్ద ట్రాఫిక్ స్తంభించింది. జిల్లా సాధన సమితి నాయకులు సొబ్బన మోహన్, రాజశేఖర్ బాబు, ఎస్‌కె పాతిమున్నీసా తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల నిరసన



బుట్టాయగూడెం: పోలవరం నియోజకవ ర్గ జిల్లా సాధన కమి టీ ఆధ్వర్యంలో మం డలంలోని గుంజ వరం, అమ్మపాలెం, చీమలవారి గూడెం గ్రామాల్లో గిరిజనులు నిరసన తెలిపారు. ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు తెల్లం రామకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం పోలవరం పేరుతో నూతనంగా ఏర్పాటు చేస్తున్న రంప చోడవరం జిల్లాలో పోలవరం నియోజకవర్గం లేకపోవడం బాధా కరమన్నారు. పోలవరం జిల్లాలో పోలవరం నియోజకవర్గం లోని షెడ్యూల్ ప్రాంతం, కొయ్యలగూడెం, గోపాలపురం, టి.నర్సాపురం మండ లాల్లో ఉన్న 28 ఆదివాసీ గ్రామాలను కలుపుతూ పోలవరం జిల్లాను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రంపచోడవరం జిల్లాలో పోలవ రం నియోజకవర్గాన్ని కలుపుతూ నూతన జిల్లా ఏర్పాటు చేయకుంటే ఉద్యమిస్తామని హెచ్చరించారు. నాయకులు పోలోజు నాగేశ్వరరావు, కొర్స రామిరెడ్డి, ఎం.దుర్గా రావు, చూంద్రు సూర్యారావు, ఎం.పోసిరెడ్డి ఆదివాసీలు పాల్గొన్నారు.

పునరాలోచించాలి : అక్కినేని వనజ, సీపీఐ

జీలుగుమిల్లి: పోలవరం జిల్లా ఏర్పాటుపై ప్రభుత్వం పునరాలోచించాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ అన్నారు. పార్టీ స్థాపించి వందేళ్ల పూర్తయిన సందర్భంగా జీలుగుమిల్లిలో నియోజవకర్గ సమన్వయ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వాలు పోలవరం నిర్వాసితులకు నేటికి సరైన సదుపాయాలు కల్పించలేదన్నారు. నాయకులు ఎండీ ముస్సీర్, కృష్ణచైతన్య, కారం . ధారయ్య, బోడిక రాము, బిఎస్.సాగర్, కొప్పుల నాగరాజు ఉన్నారు.

పోలవరం నియోజకవర్గాన్ని చేర్చాలి: రవి, సీపీఎం

కుక్కునూరు: ప్రభుత్వం ప్రకటించిన పోలవరం జిల్లాలో పోలవరం నియోజకవర్గంలో షెడ్యూల్ గ్రామాలు, కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం, గోపాలపురం మండలాల్లోని 28 నాన్ షెడ్యూల్ గిరిజన గ్రామాలు చేర్చాలని సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. ఆదివారం కుక్కునూరులో జరిగిన మండల కమిటీ సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పోలవరం జిల్లాలో పోలవరం నియోజకవర్గంలేకపోవడం దారుణమన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులను కలుపుతూ జిల్లా చేస్తానని చెప్పిన సీఎం పోలవరం లేకుండా జిల్లా ప్రకటించటం సరైందికాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రజల అభిప్రాయం మేరకు పోలవరం నియోజక వర్గాన్ని పోలవరం జిల్లాలో కలపాలని లేదంటే పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ముడియం నాగమణి, వై.నాగేంద్ర రావు, వై.సాయికిరణ్, బొయ్యిన శ్రీను, లక్ష్మయ్య, రమేశ్, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

యూటీఎఫ్ కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్సీ గురుమూర్తి



సమావేశంలో మాట్లాడతున్న ఎమ్మెల్సీ గురుమూర్తి

దెందులూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమ స్యలను వెంటనే పరిష్కరించాలని, ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యా యులను నిర్లక్ష్యం చేసిన గత ప్రభుత్వాలు తీవ్రంగా నష్టపోయాయని ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బొర్రా గురుమూర్తి అన్నారు. ఆదివారం దెందులూరు టీటీడీ కల్యాణ మండపంలో యూటీఎఫ్ జిల్లా 4వ కౌన్సిల్ సమావేశం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు షేక్ ముస్తఫా అలీ, రవి కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ గురుమూర్తి, మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలను ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని కోరారు. తొలుత కామ్రేడ్ షేక్ సాబ్జీకి నివాళులు అర్పించారు. ఎన్‌జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు చోడవరపు శ్రీనివాస్, మండల అధ్యక్షుడు తోట కేనడీ, ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, మనోహర్ సుభాషిణి, హరినాథ్, నంభూరి రాంబాబు, మేకా లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అమ్మవార్ల దర్శనానికి వచ్చిన భక్తులు

మేడల్లో అమ్మవార్లకు విశేష పూజలు

ఏలూరుకార్పొరేషన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఏలూరులోని తూర్పువీధి ఆలయ ప్రాంగణంలో జాతర నేపథ్యంలో అమ్మవార్లను మేడల్లో ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. ఆదివారం పెద్ద సంఖ్యలో మహిళలు, భక్తులు మేడల్లో అమ్మవారిని దర్శించుకుని ఆరాధించారు. పసుపు, కుంకుమలతో అర్చనలు జరిపారు. నివేదనలు సమర్పించారు. గంగానమ్మ, పోతురాజు బాబుల సన్నిధిలో భక్తులు కుంభం పోసి ఆరాధించారు. భక్తులతో, పూజలతో ఆలయ ప్రాంతం కిటకిటలాడింది. ఆలయ అధ్యక్షులు వంకినేని భానుప్రకాష్, జాతర కమిటీ నాయకులు జిల్లెళ్ళమూడి నరసింహారావు, మాజీ కార్పొరేటర్ మారం హనుమంతరావు భక్తులకు ఏర్పాట్లు చేశారు.



మేడలో కొలువైన అమ్మవార్లు

ముగిసిన రాష్ట్ర స్థాయి టాంగ్-థా ఎంపిక పోటీలు

పరవాడ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): పరవాడ ఇండోర్ స్టేడియంలో టాంగ్-థా అండర్-14, 17, 19 విభాగాల్లో బాలబాలికలకు రెండు రోజులుగా జరుగుతున్న రాష్ట్ర స్థాయి ఎంపిక పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఏడు జిల్లాల నుంచి 250 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. ఆద్యంతం పోటీలు హోరాహోరీగా సాగాయి. అండర్-14, 17, 19 విభాగాల్లో జాతీయ స్థాయి పోటీలకు 36 మంది విద్యార్థులు ఎంపికయ్యారని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి కేఎం.నాయుడు తెలిపారు. వచ్చే ఏడాది జనవరి 17 నుంచి 22వ తేదీ వరకు ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి టాంగ్-థా పోటీల్లో 36 మంది విద్యార్థులు పాల్గొంటారని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా మాజీ కార్యదర్శి ఎంవీ.నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శి అచ్చెమ్మ, ఎస్‌జీఎఫ్ రాష్ట్ర పరిశీలకులు శ్రీహరిరాజు, ఏవీడీ ప్రసాద్, నాయుడు, ప్రతినిధులు జి.రాజు, ఎ.నూకరాజు, ఎస్.శ్రీనివాస్, పి.లక్ష్మి పాల్గొన్నారు.



హైవే పక్కన ఆగిన కారు

తృటిలో తప్పిన పెనుప్రమాదం

తాడేపల్లిగూడెం రూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి):తాడేపల్లిగూడెం జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం ఒక కారు ఎగిరి పడి రోడ్డు ఎడ్జిలో ఉన్న చెట్టును ఢీకొట్టింది. తణుకు నుంచి భార్యభర్తలు తాడేపల్లిగూడెం వస్తుండగా నిట్ కళాశాల జంక్షన్ వద్ద అడ్డుగా మరో వాహనం రావడంతో కారు బ్రేక్ వేశాడు. దీంతో కారు ఎగిరి పక్కనే ఉన్న చెట్టును ఢీకొట్టి ఆగింది. దీంతో భార్య భర్తలు స్వల్పగాయాలతో బయటపడ్డారు. కారు ఎగిరిపడిన సమయంలో ఏ లారీ లాంటి వాహనం వచ్చి ఉంటే పరిస్థితి మరోలా ఉండేదని స్థానికులు చెబుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

లింగపాలెం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ధర్మాజీగూడెం, కొణిజర్ల రహదారిలో టిప్పర్ లారీ ఢీ కొట్టడంతో ఒక వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు అందించిన సమాచారం ప్రకారం మండలంలోని కొణిజర్ల గ్రామానికి చెందిన సి.హెచ్. వెంకటేశ్వరరావు(60)అనే వ్యక్తి రోడ్డుపై ఉండగా టిప్పర్ లారీ రివర్స్‌లో వెనక్కి వస్తూ ఢీకొట్టడంతో వెంకటేశ్వరరావు అక్కడి కక్కడే మృతి చెందాడు. అటువైపుగా వెళ్తున్నవారు కుటుంబ సభ్యులకు పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించి రాకపోకలకు అంతరాయం లేకుండా చేశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకన్న తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని చింతలపూడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

జాతీయ బాడీ బిల్డింగ్ పోటీల్లో ధనుష్‌కు గోల్డ్ ప్రోకార్డు



గోల్డ్ ప్రోకార్డుతో ధనుష్

చింతలపూడి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి):ఇటీవల ఢిల్లీలో మసేల్‌మేనియా ఆధ్వర్యంలో జరిగిన జాతీయ స్థాయి బాడీ బిల్డింగ్ పోటీల్లో ఏలూరు జిల్లా చింతలపూడికి చెందిన కంపసాటి ధనుష్ గోల్డ్ ప్రోకార్డు సాధించాడు. ఈ పోటీలో ధనుష్ తన కండల సౌష్టవం పటిష్టమైన తయారీలో తిరుగులేని ఆధిపత్యం ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలో ఆయన విజయం సాధించి గోల్డ్ ప్రోకార్డు అందుకున్నారు. ఢిల్లీలో యూపీఎస్సీ పరీక్షల కోసం ఢిల్లీలో శిక్షణ పొందుతున్నాడు. ఈ శిక్షణ కూడా సివిల్స్ సాధించాలనే లక్ష్యం పెట్టుకున్నాడు. గ్రామస్థాయి, జిల్లా స్థాయి అంతర్ రాష్ట్ర పోటీల్లో పలు అవార్డులు పొందిన ధనుష్ జాతీయ స్థాయిలో గోల్డ్ ప్రోకార్డు పొంది త్వరలో యూఎస్‌ఎలో జరిగే అంతర్జాతీయ పోటీలకు భారతదేశం తరఫున పాల్గొనబోతున్నారు. ఇందుకు అవకాశం లభించడంతో ఈ గ్లోబల్ వేదికపై జరిగే పోటీల్లో విజయం సాధిస్తానని ఆశాభావం వ్యక్తం చేశారు. అదేవిధంగా సివిల్స్ పరీక్షల్లో విజయం సాధించాలని శిక్షణ పొందుతున్నట్టు తెలిపారు. మండలంలోని పట్టాయిగూడెం గ్రామానికి చెందిన కంపసాటి సత్యనారాయణ, పార్వతీ దంపతుల కుమారుడైన ధనుష్ శిక్షణ లేకుండానే స్వయంకృషితో ఈ విధంగా సాధించడంతో స్థానికులు పలువురు అభినందనలు తెలియచేస్తున్నారు.

ఏలూరు మీదుగా రెండు ప్రత్యేక రైళ్లు

ఏలూరు క్రైం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి) : ప్రయాణికుల రద్దీ దృష్ట్యా దక్షిణ మధ్య రైల్వే శాఖ ఏలూరు మీదుగా రెండు ప్రత్యేక రైళ్ళను నడపనుంది. రైల్ నెంబర్ 07148 చర్లపల్లిలో ఈ నెల 8వ తేదీ రాత్రి 9.35 గంటలకు బయల్దేరి 9వ తేదీ రాత్రి 11.50 గంటలకు షాలి మార్ చేరుకుంటుంది. రైల్ నెంబర్ 07149 షాలిమర్‌లో ఈ నెల 10వ తేదీ మధ్యాహ్నం 12.10 గంటలకు బయల్దేరి 11వ తేదీ సాయంత్రం 4 గంటలకు చర్లపల్లి చేరుకుంటుంది. ఈ రెండు రైళ్లు గుంటూరు జంక్షన్, విజయవాడ జంక్షన్, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట జంక్షన్, అనకాపల్లి, దువ్వాడ, విజయనగరం జంక్షన్, శ్రీకాకుళంరోడ్, బరంపూర్, కూర్థా రోడ్ జంక్షన్, భువనేశ్వర్, కటక్, బాద్రక్, బాలసూర్, కరగ్‌పూర్ జంక్షన్, సత్రగంజి స్టేషన్లలో ఆగనున్నాయి. ఈ రైళ్ళల్లో టూటైర్ ఏసీ, త్రి టైర్ ఏసీ, స్లీపర్, జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌లు ఉంటాయని తెలిపారు.

జూదాలను అరికట్టాలి.. డీవైఎఫ్ఐ డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సూర్యకిరణ్

ఏలూరుకార్పొరేషన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): పండుగ సందర్భాలను పురస్కరించుకుని జిల్లాలో కోడి పందాలు, జూదాలు జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని, తద్వారా యువత సన్మార్గంలో నడుస్తుందని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య జిల్లా కార్యదర్శి ఎన్. సూర్యకిరణ్ డిమాండ్ చేశారు. ఏలూరులోని సీపీఎం కార్యాలయంలో ఆదివారం డీవైఎఫ్ఐ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ గంజాయి రాష్ట్రంలోను ప్రధానంగా ఏలూరులో విచ్చలవిడిగా లభ్యమవుతున్నాయని, డ్రగ్ కల్చర్ విపరీతంగా పెరుగుతోందని వాపోయారు. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా పోరాడిన నెల్లూరు జిల్లా యువజన నాయకుడు పెంచలయ్యను గంజాయి ముఠా హత్య చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. పెంచలయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. పోలీసులు ఆర్భాటపు ప్రకటనలు తప్ప కోడి పందాలను నిలువరించలేకపోతున్నారని అన్నారు. డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు పి.శివశంకర్, నాయకులు పంపన రవికుమార్, జె.గోపి, మనోజ్, లోకేంద్ర, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

12న క్రాస్ కంట్రీ అథ్లెటిక్స్ పోటీలు

ఏలూరురూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కామవరపుకోట జడ్పీ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో ఈ నెల 12న ఏలూరు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రాస్ కంట్రీ జిల్లా స్థాయి పోటీలు, ఎంపికలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శి, గొల్ల ప్రసాదరావు, దేవరపల్లి ప్రసాద్ తెలిపారు. ప్రతిభ గల క్రీడాకారులను ఎంపిక చేస్తామన్నారు. ఎంపిక చేసిన క్రీడాకారులు ఈ నెల 24న కాకినాడ జిల్లా, పెద్దాపురంలోని ఎంఆర్ కళాశాలలో జరిగే రాష్ట్రస్థాయి క్రాస్ కంట్రీ పోటీల్లో ప్రాతినిధ్యం ఇస్తారని తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు అండర్-16, 18, 20 విభాగాలలో బాల బాలికలు, పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు, వయస్సు ధృవీకరణ పత్రం, ఆధార్‌కార్డు, పుట్టిన తేదీ సర్టిఫికెట్, ఎస్ఎస్‌సి మార్క్స్ లిస్టుతో 86865 40555 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న వ్యాను

రేషన్ బియ్యం స్వాధీనం

కామవరపుకోట, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కామవరపుకోట మండలం తడికలపూడి సెంటర్‌లో తడికలపూడి పోలీసు సిబ్బంది వాహనాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జంగారెడ్డిగూడెం నుంచి ఏలూరు వైపు వెళ్తున్న ట్రక్కు వ్యానులో తనిఖీల్లో నాలుగు క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం ఉన్నట్టు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ బియ్యాన్ని ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చే వరకు భద్రపర్చాలని తడికలపూడిలోని ద్వారకాసాయి రైస్‌మిల్లు అధినేత ఈడ్పుగంటి సందీప్‌కు అప్పగించారు. తడికలపూడి పోలీసులు, సివిల్ సప్లయి డిప్యూటీ తహసీల్దార్ శేషగిరిలు కేసు నమోదు చేశారు.

వ్యభిచారం కేసులో ముగ్గురి అరెస్టు

యలమంచిలి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాజ గ్రామంలో వ్యభిచారం కేసులో పోలీసులు ముగ్గురిపై కేసు నమోదు చేశారు.సమాచారం మేరకు పోలీసులు శనివారం రాత్రి లాడ్జిపై దాడి చేసి ఇద్దరు విటులు, ఒక మహిళను అరెస్టు చేసినట్లు ఎస్ఐ కె.గుర్రయ్య తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఎన్‌ఎంఎస్ పరీక్షలకు 1083 హాజరు

నరసాపురం టౌన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఐదు సెంటర్లలో ఆదివారం ఎన్‌ఎంఎస్ (నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్) పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్టు ఎంఈవో పుష్పరాజ్యం తెలిపారు. ఈ పరీక్షలకు 1116 మంది హాజరుకావాల్సి ఉండగా 33 మంది గైర్హాజరయ్యారు. అన్ని కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు నిర్వహించారు. తరుచూ కేంద్రాల వద్ద స్క్వాడ్ తనిఖీలు నిర్వహించారు.

గంగాలమ్మకు అలంకరణ



నరసాపురం రూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్‌బిచర్ల గ్రామంలో ఆదివారం గంగాలమ్మ అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పలువురు భక్తులు అమ్మవార్ని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణం వద్ద అన్నసమారాధన నిర్వహించారు.

ధర్మ పరిరక్షణ కోసం పనిచేయాలి



దత్త పీఠాధిపతి సాయి దత్త నాగానంద సరస్వతి స్వామీజీని సన్మానిస్తున్న దృశ్యం

పోడూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ధర్మ పరిరక్షణ కోసం ప్రతి హిందువు అంకితభావంతో పని చేయాలని దత్త పీఠాధిపతి సాయి దత్త నాగానంద సరస్వతి స్వామీజి పిలుపునిచ్చారు. పోడూరులోని బాలసంఘం సెంటర్‌లో ఆదివారం జరిగిన మండల స్థాయి హిందూ సమ్మేళన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రామాయణం, భారత, భాగవతాలు మత గ్రంథాలు కాదని ప్రజలను ధర్మం వైపు నడిపించే దిక్సూచికలని ఆయన అన్నారు. తల్లిదండ్రులంతా తమ పిల్లలపై వ్యక్తిగత శ్రద్ధ మరింత పెంచి సాంప్రదాయ పద్ధతులను నేర్పించాలని కోరారు. సనాతన ధర్మం ఆచరిస్తూ ఇతరులకు ఆదర్శప్రాయంగా జీవించాలని సూచించారు. ప్రముఖ వక్త శ్రీతులసి సూర్యప్రకాష్ మాట్లాడుతూ కులాలకు అతీతంగా హిందువులంతా ఐక్యం కావాలని పిలుపునిచ్చారు. ఈసందర్భంగా లక్ష రుద్రాక్షలతో శివలింగానికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో మాజీసర్పంచ్ రుద్రరాజు సుజాత, రమేష్‌రాజు దంపతులు, దేవస్థానం చెర్మన్ కోసూరి సీతాదేవి, పాలకొల్లు ప్రాంత ఆర్‌ఎస్‌ఎస్ కండ్ అధ్యక్షుడు భూపతిరాజు నరసింహారాజు పాల్గొన్నారు.

పార్వతీ రామలింగేశ్వరస్వామికి ఆరుద్రోత్సవం



పార్వతీ, సోమేశ్వరస్వామికి అభిషేకాల దృశ్యం

పోడూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): గుమ్మలూరు శివారు రావిగొప్పు శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ఆరుద్రోత్సవం సందర్భంగా శ్రీపార్వతీ రామలింగేశ్వరస్వామి వార్లకు విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు, వేదపండితుల మంత్రోర్ఛణలతో పరిసర ప్రాంతాల నుంచి భక్త జనసందోహం మధ్య స్వామివారికి అమ్మవారికి గంగా జలాలు, ఆవుపాలు, పంచామృతాలతో విశేషాభిషేకాలు నిర్వహించారు. శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు.

దేశాన్ని విశ్వగురువుగా నిర్మాణం చెయ్యాలి

భీమవరం టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): హిందూ సమాజాన్ని చైతన్యం చేసి ఈ దేశాన్ని విశ్వ గురువుగా నిర్మాణం చేయాలని పెనుగొండ పీఠాధిపతి ప్రజ్ఞానంద సరస్వతి తెలిపారు. భీమవరంలోని త్యాగరాజ భవనంలో ఆదివారం నిర్వహించిన హిందూ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ 1925లో ప్రారంభించబడిందన్నారు. సంఘ్ ప్రయాణంలో 100 సంవత్సరాల నిరంతర కృషిని గుర్తు చేశారు. హిందూ సంస్కృతిని ప్రతి ఒక్కరు ఆచరించాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ గోదావరి విభాగ్ కార్యవాహ బెల్లపుకొండ వీరభద్రరాజు, హిందూ సమ్మేళనాల నిర్వహణ కమిటీ అధ్యక్షుడు తటవర్తి చిన్న వెంకట నరసింహారావు, సుంకర అలివేలు మంగతాయారు, శ్రీ మావుళ్ళమ్మ పాల్గొన్నారు.

అత్తిలి షష్టి తీర్థానికి కిక్కిరిసిన భక్తులు



అత్తిలి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): అత్తిలి పట్టణంలో ప్రతిఏటా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే సుబ్రహ్మణ్య షష్టి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. షష్ట ఉత్సవాలు మొదలైన నేటికి 11 రోజులు అయినప్పటికీ ప్రజలు పెద్ద ఎత్తున తీర్థ మహోత్సవాలను తిలకించేందుకు తరలి వచ్చారు. దానికితో ఆదివారం కావడంతో జనంతాకిడి మరింత పెరిగింది. అత్తిలి చుట్టూ పక్కల అనేక గ్రామాల ప్రజలు షష్టి తీర్థాన్ని తిలకించేందుకు పోటెత్తారు.

ఎమ్మెల్యే ఆరిమిల్లి సంతాపం

అత్తిలి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి):అత్తిలి మండల తెలుగుదేశంపార్టీ సీనియర్ నాయకులు మాజీ మండల టీడీపీ అధ్యక్షులు ఆనాల ఆదినారాయణరావు కుమారుడు ఆనాల అభిరామ్ ఇటీవల మృతి చెందడం పట్ల శాసనసభ్యుడు ఆరిమిల్లి రాధాకృష్ణ సంతాపం తెలిపారు. ఎమ్మెల్యే ఆరిమిల్లి ఆనాల ఇంటికెళ్ళి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

కళ్యాణ మండపం ప్రారంభం

భీమవరం రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): చిన అమిరం గ్రామంలో శ్రీ స్వామి యోగీశ్వరానందగిరి విశ్వశాంతి వృద్ధుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన కళ్యాణ మండపాన్ని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ ఆదివారం ప్రారంభించారు. శ్రీనివాస వర్మ మాట్లాడుతూ వృద్ధుల సంక్షేమం కోసం నిర్మించిన కళ్యాణ మండపం నిర్మాణం, ఆశ్రమ నిర్వహణ పట్ల దాతలను, నిర్వాహకులను అభినందించారు. ముఖ్యఅతిథులుగా ఏపీ శాసన మండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, పీఏసీ ఛైర్మన్ పులపర్తి రామాంజనేయులు, టీటీడీ మాజీ ఛైర్మన్ కనుమూరి బాపిరాజు- అన్నపూర్ణమ్మ దంపతులు, తెలుగు దేశం పొలిట్ బ్యూరో సభ్యులు తోట సీతారామలక్ష్మి, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ వేగేశ్న కనకరాజు సూరి, మాజీ శాసనసభ్యులు పుప్పాల ఏసుబాబు, రాష్ట్ర తెలుగు దేశం పార్టీ కోశాధికారి మెంటే పార్థసారధి, జిల్లా జనసేన పార్టీ ఛైర్మన్ కొటికలపూడి గోవిందరావు, తెలుగు దేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోళ్ళ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

షెడ్డు, షవర్లు ఏర్పాటు

పాలకోడేరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మోగల్లు గ్రామంలో పంచాయతీ చెరువుల వద్ద రూ. 10 లక్షలతో శ్మశానవాటిక వద్ద రెండు షెడ్లు నిర్మాణం, రెండుచోట్ల షవర్లను ఏర్పాటు చేశారు. మోగల్లు గ్రామ పంచాయతీలో హిందూ శ్మశానవాటికకు సంబంధించి అంత్యక్రియలు నిర్వహించిన అనంతరం స్నానాలు చేసేందుకు స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలోని ఊర చెరువు, సుబ్బరాజు చెరువుల వద్ద రెండు షెడ్లను నిర్మించడంతోపాటు షవర్లను ఏర్పాటు చేశారు.



స్నేహభావం ఎంతో గొప్పది

భీమవరం రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్నేహభావం ఎంతో గొప్పదని విద్యాభ్యాసంలోని స్నేహం వీడనిదని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. ఆదివారం ఏ.ఆర్.కే.ఆర్. స్కూల్‌లోని 1987-88 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. స్నేహభావం ఎలా ఉంటుందో తెలిపారు. అనంతరం పూర్వపు విద్యార్థులు గీతాలాపనలు వంటి కార్యక్రమాలతో అలరించారు. అప్పట్లో విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులను గుర్తు చేసుకున్నారు. చదువుకునే రోజుల్లోని తీపి సంఘటనలను నెమరువేసుకున్నారు.

కాలినడకన భవానీ మాలధారులు

మొగల్తూరు. డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): భవానీ మాలధారులు విజయవాడ దుర్గమ్మ ఆలయానికి కాలినడకన బయలుదేరారు. చామకూరిపాలెంకు చెందిన పది మంది భవానీమాలధారులు ఆదివారం కాలినడకన విజయవాడకు వెళ్ళారు. ముత్యాలపల్లి బండి ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. మరో రెండు రోజులు నడకదారిలో విజయవాడకు చేరుకుని అమ్మవారిని దర్శించుకుంటామని వారు తెలిపారు.

రహదారి నిర్మాణం కోసం ధర్నా



మొగల్తూరు, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): రహదారి నిర్మించాలని గ్రామస్థులు మూడవసారి ఆందోళన బాట పట్టారు. మండల కేంద్రమైన మొగల్తూరు నుంచి భీమవరం మండలం వెంప గ్రామం వరకు గల 5 కిలో మీటర్ల ఆర్‌అండ్‌బి రహదారి గోతులతో అధ్వానంగా మారింది. గత తెలుగుదేశం హయాంలోనూ ఈరహదారి నిర్మాణానికి నిధులు మంజూరై శంకుస్థాపన చేశారు. ఆపాలనలో రహదారి నిర్మాణం చేపట్టకపోవడంతో అనంతరం వచ్చిన వైసీపీ పాలనలోనూ మరోసారి టెండర్‌లు పిలిచి పనులు గుత్తేదారుకు కేటాయించి మరోసారి శంకుస్థాపన చేశారు. ఎన్ని సార్లు శంకు స్థానలు చేసినా ప్రభుత్వాలు మారినా ప్రజా ప్రతినిధులు మారినా రహదారి పునర్మాణానికి మోక్షం లభించలేదు. దనితో గ్రామస్థులు ఆదివారం ఆందోళన బాట పట్టారు. రహదారి నిర్మాణ పనులు చేపట్టాలంటూ గొల్లగూడెం, పడమటిపాలెం, నక్కావారిపాలెం, సుబ్రహ్మణ్యేశ్వరం, కొత్తపాలెం గ్రామస్థులు ధర్నా చేశారు.

భగవద్గీత ప్రచారం

పాలకొల్లు అర్బన్, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): దేవాలయాల నిజ అర్థాన్ని తెలియజేసేదే త్రైత సిద్ధాంతం అని మామిడికుదుకు చెందిన త్రైత కమిటీ సభ్యులు పెదమామిడిపల్లిలో ఆదివారం ప్రచారం నిర్వహించారు. కమిటీ అధ్యక్షుడు బండారు సత్యనారాణ ఆధ్వర్యంలో భగవద్గీత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ శరీరం దేవాలయం అయితే, ఆత్మ దేవుడు అని తెలిపారు.



పాలకవర్గాన్ని సన్మానించిన కూటమి నేతలు

నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం

ఆకివీడు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక చింతనతోనే ప్రజానీకం శాంతిమార్గంలో పయనిస్తారని టీడీపీ గౌరవధ్యక్షులు మోటుపల్లి రామవర ప్రసాద్ అన్నారు. మాణిక్యాంబ సమేత భీమేశ్వర స్వామి దేవస్థానం నూతన పాలకవర్గ చైర్మన్ వేమూరి వెంకట సీతారామశాస్త్రి, సభ్యులు చుండూరు వెంకటేశ్వరరావు, జంగారెడ్డి మణికంఠ కొండారెడ్డి, చింతా ఆదిశేషు, పొడ్డిని రాంబాబు, షైపాల శ్రీదే వి, మాదుగుల దుర్గాభవాని, నక్కని శ్రీలక్ష్మి, త్రిపర్తి చంద్రకుమారి, అర్చకులు మెవ్వా వెంకటరత్నలతో ఈవో అల్లూరి సత్యనారాయణరాజు ఆదివారం ప్రమాణం చేయించారు. అనంతరం వార్ని కూటమి నేతలు ఘనంగా సన్మానించారు.

ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం

భీమవరం టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): భీమవరం గునుపూడిలోని 10వ వార్డులో ఆదివారం న్యూటన్ ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. దళిత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందర్ కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, శిక్షణ కేంద్రం నిర్వాహకులు ఏలేటి న్యూటన్ మాట్లాడుతూ మూడు నెలలపాటు ఉచిత శిక్షణ అందిస్తామని, శిక్షణలో అర్హులైన వారందరికీ రాజ్ ట్రస్టు సహకారంతో ఉచితంగా కుట్టు మిషన్లు అందిస్తామని తెలిపారు.



ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యవర్గం ఎన్నిక

తాడేపల్లిగూడెం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి):రాష్ట్రప్రభుత్వం బకాయి పడిన రూ.6100 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలిని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు పి.రామ్మోహన్ డిమాండ్ చేశారు. ఎస్‌ఎఫ్‌ఐ 47వ జిల్లా మహాసభలు రెండవ రోజు ఆదివారం తాడేపల్లిగూడెంలో కొనసాగింది. ఈ సమావేశాలకు అధ్యక్షవర్గంగా గణష్, సాయికృష్ణ, సింధు, రోహిత్‌లు వ్యహరించారు. తొలుత పోరాట వీరులు అల్లూరి సీతారామరాజు, భగత్‌సింగ్, భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ ఇంటీవల గుండాల చేతిలో మరణించిన డీవైఎఫ్ఐ నాయకుడు పెంచలయ్య చిత్రపటాలకు రాష్ట్ర అధ్యక్షుడు పూలమాల వేసి నివాళులుఅర్పించారు. అనంతరం జిల్లా నూతన కార్యకవర్గం ఎంపిక చేశారు. అధ్యక్షుడుగా బి.గణేష్, కార్యదర్శి టి.ప్రసాద్, ఉపాధ్యక్షులుగా సింధు, నాగేంద్ర, లక్ష్మణ్, ఈశ్వర్, సహాయ కార్యదర్శిగా శ్రీను, రోహిత్, మరో 15 మంది కమిటీ సభ్యులను సమావేశం ఎన్నుకున్నది.

టిడ్కో ఇళ్లకు బ్యాంక్ రుణాలు మాఫీ చేయాలి

తాడేపల్లిగూడెం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి):టిడ్కో ఇళ్లకు బ్యాంక్ రుణాలు మాఫీ చే యాలని ఐద్వా ఆధ్వర్యంలో ఆదివారం ఆందోళన చేపట్టారు. నిరసనగా ఐద్వా ఆధ్వర్యంలో లబ్ధిదారులు టిడ్కో సముదాయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. కనీస అవసరాలు కల్పించాలని నినాదాలు చేశారు. ఐద్వా కార్యదర్శి పొగాకు పూర్ణిమ మాట్లాడుతూ టిడ్కో సముదాయంలో పాముల బెడద ఎక్కువగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వైసీపీ అధికారంలో ఉండా రుణాలను కట్టకుండా ఆపిన టీడీపీ ఇప్పుడు అధికారంలోకి వచ్చాక ఆ మాటే ఎత్తడం లేదని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి యశోధ, ఎం పావని, మండల కార్యదర్శి పీ సత్యవతి, మహిళలు పాల్గొన్నారు.

'యాదవులను దూషించ లేదు'

తణుకు రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలో సమస్యలను పక్కదోవ పట్టించే దుకు మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి యాదవులను దూషించినట్లుగా ముఖ్యమ ంత్రి చంద్రబాబు నాయుడు, టీడీపీ నాయకులు మాట్లాడుతూ డైవర్ట్ పాలిటిక్స్‌కు పాల్పడుతున్నారని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఆదివారం తణుకులోని వైసీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ యాదవులను మాజీ ముఖ్యమంత్రి జగన్ అనని మాటలను అన్నట్లుగా విమర్శించడం దారుణమన్నారు. అలా బీసీ కులాల వారిని దూషించిన చరిత్ర చంద్రబాబుకు వుందని చెప్పారు.

శతాధిక వృద్ధురాలి మృతి



సూర్యకాంతం (ఫైల్ ఫోటో)

పెనుమంట్ర, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి):మాముడూరు గ్రామానికి చెందిన వయోవృద్ధురాలు, గ్రామ మాజీ సర్పంచ్ దాట్ల సూర్యనారాయణ రాజు సతీమణి సూర్యకాంతం (100) వృద్ధాప్య కారణంగా ఆదివారం ఉదయం మృతి చెందారు. ఆమె భర్త మాజీ సర్పంచ్ కరోనా కాలంలో 102 సంవత్సరాల వయస్సులో మరణించారు. ఆమెకు నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.ఆమె కుమార్తెల్లో ఒకరు డాక్టర్ కలిదిండి అన్నపూర్ణ పెనుగొండలోని ప్ర ముఖ డాక్టర్ యల్లాప్రగడ మెమోరియల్ హాస్పటల్ ను భర్త డాక్టర్ కె. రామచంద్ర రాజుతో కలిసి గత నాలుగు దశాబ్దాలుగా నిర్వహిస్తున్నారు. సూర్యకాంతం కుమార్తె, కుమారుడుతో పాటు మనుమలు, మనుమరాళ్ళలో అనేక మంది వైద్య వృత్తిలో ఉన్నారు. సూర్యకాంతం అంత్యక్రియలు స్వగ్రామం మాముడూరులో సోమవారం రాజమండ్రిలో జరుగుతాయి. ఆమె మృతికి పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

శంకర మఠంలో నక్షత్ర అభిషేకం



జగద్గురుకు ప్రత్యేక అభిషేకాలు

తాడేపల్లిగూడెం రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి గూడెం పట్టణంలోని శంకర మఠంలో ఉమా చంద్రమౌళేశ్వర స్వామి సర్వమంగళ అమ్మవారి దేవస్థానం వద్ద ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ప్రత్యేక అర్చనలు చేశారు. జగద్గురు ఆది శంకరాచార్యస్వామివారికి విశేష అర్చనలు నిర్వహించారు. ఉమాచంద్ర మౌళేశ్వరస్వామికి 108 రకాల ద్రవ్యాలతో 6 గ్రాముల బంగారు రజనుతో సువర్ణాభిషేకం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి పూజల్లో భాగస్వాములయ్యారు.

వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు జగ్జీవన్ రాజీనామా

తాడేపల్లిగూడెం రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి):వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, ఎస్సీ ఎస్టీ మోనటరింగ్ కమిటి మాజీ సభ్యుడు తన్నేటి జగ్జీవన్ పార్టీ సభ్యత్వానికి, పదవులకు ఆదివారం రాజీనామా చేశారు. పార్టీ విధానాలు పార్టీ మనుగడను దెబ్బతీసేలా ఉన్నాయని పార్టీ కోసం పనిచేసేవారికి గుర్తింపు లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

క్యాన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తించాలి

అత్తిలి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తిస్తే నయం చేయడం సులువవుతుందని, ప్రతి ఒక్కరూ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని లయన్స్ మల్టీపుల్ కౌన్సిల్ ఛైర్‌పర్సన్ ఎం.శ్రీరామ్ సురేష్ అన్నారు. అత్తిలి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రి సహకారంతో అత్తిలిలో ఏర్పాటు చేసిన ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరాన్ని సురేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 9 నుంచి 14 సంవత్సరాల లోపు పిల్లలకు క్యాన్సర్ రాకుండా హెచ్పీవీ వ్యాక్సిన్ వేయించుకోవాలని అన్నారు. క్లబ్ అధ్యక్షుడు శిరగాని నాగేశ్వరరావు, పట్నాల వెంకటేశ్వరరావు, గొర్రెలు వెంకట్రావు, పెద్దపల్లి మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

హిందువులపై పెరుగుతున్న దాడులు

అత్తిలి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా హిందువులపై దాడులు పెరుగుతున్నాయని, మహిళలను అన్యమతస్తులు చంపుతున్నారని ముండూరు యాజ్ఞవల్క్య రాజా ఆశ్రమ పీఠాధిపతి డాక్టర్ కృష్ణ చరణానంద భారతీ స్వామి అన్నారు. అత్తిలి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్టి ఉత్సవాలలో నిర్వహించిన హిందూ సమ్మేళనం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. హిందూ వాదాన్ని నాశనం చేయాలని అన్యమతస్తులు ప్రయత్నిస్తున్నారని అన్నారు. సమరసత సేవా ఫౌండేషన్ ప్రాంత సహసంయోజక్ తులసి సూర్య ప్రకాష్, వాడపల్లి సూర్యతేజ తదితరులు మాట్లాడారు.

విద్యార్థినికి సైకిల్ అందజేత

అత్తిలి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): అత్తిలి మండలం ఈడూరు గ్రామంలో దివ్యాంగుడు సుభాష్ కుమార్తె ఆరాధ్య చదువు నిమిత్తం అత్తిలి ఎఎంసీ ఛైర్మన్ దాసం ప్రసాద్ సైకిల్ని అందించారు. దాత ప్రసాద్‌కు దివ్యాంగుడు సుభాష్ కృతజ్ఞతలు తెలిపారు.

సీనియర్ బీజేపీ నేత కుమార్‌కు పితృ వియోగం



జక్కంపూడి నరసింహారావు

పాలకొల్లు అర్బన్, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన బిజేపీ సీనియర్ నేత, రైల్వే బోర్డు మెంబరు జక్కంపూడి కు మార్ తండ్రి నరసింహారావు (75) శని వారం రాత్రి మరణించారు. ఆయనకు ఒక కుమారు డు, కుమార్తె ఉన్నారు. నర సింహారావు మృతి పట్ల బీజేపి నాయకులు, కూటమి నాయకులు, పట్టణ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.

బాధితులను మానవత్వంతో ఆదుకోవాలి

పాలకొల్లు టౌన్, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): హెచ్‌ఐవీ బాధితుల పట్ల మానవత్వంతో మెలగాలని, వారిని అన్ని విధాలా ఆదుకోవాలని మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం హెచ్‌ఐవీ బాధితులకు పౌష్టికాహారం, నిత్యావసర సరుకులు అందజేశారు. ప్రపంచ ఏయిడ్స్ దినోత్సవం సందర్భంగా లయన్స్ కమ్యూనిటీ భవనంలో జరిగినకార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కూటమి ప్రభుత్వం 105 రకాల వైద్యసేవలను హెచ్‌ఐవీ బాధితులకు అందిస్తోందన్నారు. కార్యక్రమంలో పెచ్చెట్టి బాబు గండేటి వెంకటేశ్వరరావు, బోనం చినబాబు, కర్నేన గౌరునాయుడు, కర్నేన రోజారమణి, వట్టం గణేష్, ఆరిమిల్లి చిన్నికేశవ పాల్గొన్నారు.

కుదుటపడని కొత్తజిల్లా

5వ పేజీ తరువాయి

కేటాయించారు. అక్కడ 20 ఎకరాల స్థలం అందుబాటులో ఉంది. మార్కెట్ కమిటీ కూడా రైతులకు పెద్దగా ప్రయోజనం చేకూర్చడం లేదు. గోదాములన్నీ వృథాగా పడి ఉన్నాయి. షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించినా సరే అక్కడకు ఏ ఒక్క వ్యాపారి రావడం లేదు. మత్స్యశాఖ, ఎంపెడా కార్యాలయాలను అందులోనే నిర్మించారు. దీనిని దృష్టిలో ఉంచుకుని గత ప్రభుత్వం ఏఎంసీ స్థలాన్ని కలెక్టరేట్‌కు కేటాయిస్తూ గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చింది. నిర్మాణానికి నిధులు కూడా కేటాయించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కలెక్టరేట్ విషయంపై మళ్లీ కొత్త చర్చలు ప్రారంభమయ్యాయి. స్థానిక ఎమ్మెల్యే అంజిబాబు మాత్రం జిల్లా కలెక్టరేట్‌ను ఏఎంసీలో ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్టు తెలుస్తోంది. ఏదైనా భీమవరం బ్రాండ్‌కు తగ్గట్టుగానే కలెక్టరేట్ ఉండాలంటూ జనం కోరుకుంటున్నారు. దానికి సువిశాల స్థలం అవసరం కానుంది. ప్రభుత్వం దీనిపై త్వరితగతిన నిర్ణయం తీసుకోవాలి. లేదంటే అధికారులకు, సిబ్బందికి, ప్రజలకు ఇబ్బందులు తప్పవు.

నియోజక వర్గాన్ని ఆదర్శవంతంగా నిలుపుదాం



తన కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి నిమ్మల

పాలకొల్లు అర్బన్, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): పాలకొల్లు నియోజక వర్గాన్ని అభివృద్ధిలో ఆదర్శవంతంగా నిలుపుదామని మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. ఆదివారం తన కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రి మాట్లాడారు. నియోజకవర్గంలో కోట్లాది రూపాలయలతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, అభివృద్ధి పనుల్లో జాప్యం లేకుండా నాణ్యతా ప్రమాణాలతో వేగవంతంగా పూర్తి చేయాలని మంత్రి నిమ్మల మార్గ నిర్దేశనం చేశారు. ఇరిగేషన్, టూరిజం, పురపాలక సంఘం, పబ్లిక్ హెల్త్, టిడ్కో గృహాలు, పంచాయతి రాజ్ తదితర శాఖల అధికారులు సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు.

నేడు నరసాపురం మండల సమావేశం

నరసాపురం రూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల జనరల్ బాడీ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో నాసర్‌రెడ్డి తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు ఎంపీపీ సోని అధ్యక్షతన సమావేశం జరుగుతుందన్నారు. ఇప్పటికే ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, జడ్పీటీసీలకు సమాచారం అందించామన్నారు.

జిల్లా కేంద్రం సాధనకు పోరాటం చేయాలి

నరసాపురం టౌన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి):నరసాపురానికి జిల్లా కేంద్రం కాకుండా గత ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిదని, దీన్ని సాధించేందుకు నాయకులంతా ఏకమైన పోరాటం చేయాలని ఆదివారం జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో నాయకులు తీర్మానించారు. పట్టణంలోని లయన్స్‌క్లబ్ భవనంలో డాక్టర్ చినమిల్లి సత్యనారాయణ, కూనపరెడ్డి రంగారావు, చెన్నా రమేష్‌ల ఆధ్వర్యంలో వైద్యులు, వ్యాపారవేత్తలు, స్వచ్ఛంద సంస్థలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, వివిధ క్లబ్ కమిటీ సభ్యులు హాజరయ్యారు. జిల్లా కేంద్రంపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఓ కమిటీని వేయడం జరిగిందని, ఆ కమిటీ జిల్లా పునర్ విభజన సమయంలో సీఎంకు వివరించారు. జిల్లా కేంద్రం ఆవశ్యకత, ఉన్న సదుపాయలు, వనరులపై సీఎం ఆరా తీశారన్న విషయంపై చర్చించారు. జిల్లా కేంద్రంపై ప్రభుత్వం కూడా సానుకూలంగా ఉంది. దీన్ని సాధించేలా ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. దీనిపై సోమవారం భీమవరంలో జరిగే గ్రీవెన్స్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ నాగారాణిని కలిసి వినతిపత్రం ఇద్దామని తీర్మానించారు.

తాడేపల్లి ముసలయ్య వర్ధంతి

పెంటపాడు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమయ యోధుడు పీసీసీ మాజీ అధ్యక్షుడు తాడేపల్లిగూడెం ముసలయ్య, కృపమ్మల వర్ధంతిని పెంటపాడులోని కుమారుడు, విశ్రాంత బ్యాంక్ మేనేజర్ తాడేపల్లి మోహన్‌రావు నివాసం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా 100 మంది పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ సోషల్ వెల్ఫేర్ అధికారి రామాంజనేయరాజు, మాజీ సర్పంచ్ తాడేపల్లి సూర్యకుమారి, ఎంఈవో 1, 2 లు ఎం.శ్రీనివాస్, టీవీ రామకృష్ణ, మాలమహానాడు నాయకుడు చీకటిమిల్లి మంగరాజు , గుంపుల సత్యకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీలలో భవిత విద్యార్థుల ప్రతిభ

పెంటపాడు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి) : జిల్లా స్థాయి దివ్యాంగుల క్రీడా పోటీలలో పెంటపాడు భవిత విద్యా వనరుల కేంద్రం విద్యార్థులు ప్రతిభ కనపర్చడం అభినందనీయమని ఎంఈవో 1, 2 లు ఎం.శ్రీనివాస్, టీవీ.రామకృష్ణలు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా స్థాయిలో జరిగిన క్రీడా పోటీలలో పెంటపాడు విద్యార్థులు రన్నింగ్, షార్ట్‌పుట్‌లో ఆరు పథకాలు సాధించారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను హెచ్‌ఎం రాజేష్, భవిత ఉపాధ్యాయులు సాయి స్వరూపా, సునీత అభినందించారు.

కనక మహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్న బాబ్జి



తాడేపల్లిగూడెం అర్బన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం పట్టణంలో కనకమహాలక్ష్మి అమ్మవారి 33వ వార్షికోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా భవన కార్మిక సంక్షేమ మండలి ఛైర్మన్ వలవల బాబ్జి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటి సభ్యులు బాబ్జిని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఆకాశపు స్వామి, పట్నాల రాంపండు, ముప్పిడి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

'అంబేడ్కర్ ఆశయాలు కాలరాస్తున్నారు'

పాలకొల్లు అర్బన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): దేశంలో న్యాయమైన సమసమాజాన్ని నిర్మించాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భావించారని, ఆయన ఆశయాలను నేడు కాలరాస్తున్నారని వక్తలు అన్నారు. పట్టణంలోని త్యాగరాజ భవనంలో ఆదివారం జరిగిన వివిధ పార్టీల నాయకుల రౌండ్‌టేబుల్ సమావేశానికి మాజీ ఎమ్మెల్యే దిగుపాటి రాజగోపాల్ అధ్యక్షత వహించారు. సమావేశంలో పలువురు మాట్లాడారు. ముఖ్యవక్తగా పాల్గొన్న సీపీఎం నేత సీతారామ్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పెన్మెత్స సుబ్బరాజు, జి.సూర్య వర ప్రసాద్, పోలిశెట్టి గోపాలకృష్ణ గోఖిలే, బాతిరెడ్డి జార్జీ, వై.అజయ్ కుమార్, కెవి రాయప రాజు, రాంజీ అంబేడ్కర్, చల్లా సోమేశ్వరరావు, జవ్వాది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కోటి సంతకాల సేకరణ

పాలకొల్లు అర్బన్, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 28వ వార్డులో వైసీపీ నాయకుల ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం ఆదివారం చేపట్టారు. ఈకార్యక్రమంలో సినియర్ నాయకులు కర్ర జయసరిత, జోగి వెంకటేశ్వరరావు, దుర్గారావు పాల్గొన్నారు.